
ఆంధ్రజ్యోతి, వారపత్రిక
2-9-1994

# 'ప్రజాస్వామ్యం జీవన



> "సాంఘిక, ఆర్థిక విషయాలను పరిగణనలోకి తీసుకోకుండా హింసను గురించి మాట్లాడడం సరికాదు. తుపాకీనెవరు కాకుండా, తుపాకీ ఎందుకు పట్టుకున్నారో చూడడం ముఖ్యం. తమ లక్ష్యానికి విరుద్ధమైన హింసను మేము వ్యతిరేకిస్తూనే వున్నాం. నక్సలైట్లయినా అమాయకుల్ని బలిచేయడం తప్పు."

ప్ర: 'జాతీయ మానవ హక్కుల కమిషన్' ఏ కారణాల వల్ల ఏర్పడింది?

జ: భారతదేశంపై ఇతర దేశాల నుంచీ ఒత్తిడి పెరిగింది. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు మనకు అప్పులివ్వడానికి మన మానవ హక్కుల పరిస్థితిని గురించి ప్రశ్నిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా ఈ విషయమై చాలా ప్రశ్నిస్తోంది. ఇది ఒక విధంగా Amnesty Internationalలాంటి సంస్థలు భారతదేశంలో పర్యటించడానికి దోహదపడింది. ఈ నేపథ్యంలో, మన రాష్ట్రాలలో ఏ విధంగా మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోంది అన్న విషయంపై ఒక నివేదిక తయారు చెయ్యడం ప్రభుత్వానికి అవసరమైంది. మానవ హక్కుల కమిషన్ ఈ కారణాల వల్లనే ఏర్పడింది.

ప్ర: ఈ కమిషన్ పర్యటన తర్వాత భవిష్యత్తులో ఏమైనా మార్పు కలగబోతున్నట్లు మీకనిపిస్తోందా?

జ: ఇప్పటి ఈ పర్యటన కేవలం అభిప్రాయ సేకరణ కోసం జరిగింది. ఈ సంవత్సరం మార్చి 31కి మేము ఒక నివేదికను సమర్పించాం. అందులో 1991 నుంచి 93 వరకు జరిగిన 'బూటకపు' ఎన్‌కౌంటర్ల వివరాలు ఇచ్చాం. మా లెక్క ప్రకారం 285 ఎన్‌కౌంటర్లు జరిగాయి. అందులో 496 మంది మరణించారు. మేము ప్రతి ఎన్‌కౌంటర్‌నూ ఒక్కొక్క కేసుగా విచారించమని అడిగాం. వీటికి సంబంధించిన వివరాలు, పిటిషన్లు సేకరించడం కోసం మానవ హక్కుల కమిషన్ మన రాష్ట్రానికి వచ్చింది.

ఈ కమిషన్ పర్యటన తర్వాత ఏం జరుగుతుంది అన్న విషయానికి వస్తే బహుశా ఒక రిపోర్టు ఇవ్వడం జరుగుతుంది. ప్రభుత్వం తనకు తోచిన విధంగా దానిపై చర్య తీసుకోవచ్చు. ఆ విధంగా ఈ కమిషన్‌కున్న పరిధులు తక్కువ. నేర విచారణ జరిపే అధికారం, నిజ నిర్ధారణ చేసే అధికారం మాత్రమే వున్నాయి. శిక్షించే అధికారం లేదు. అందుకే మానవ హక్కుల కమిషన్ కంటే, మానవ హక్కుల న్యాయస్థానం అవసరం ఎంతైనా వుంది. ఉన్నంతవరకూ, ఈ కమిషన్ వల్ల వాస్తవాలు బయటకు రావడానికి అవకాశం వుందనే భావిస్తున్నాను.

ప్ర: రాష్ట్రస్థాయి కమిషన్‌లు వెయ్యడం గురించి కమిషన్ ఛైర్మన్ శ్రీ రంగనాథ్ మిశ్రా మాట్లాడారు. వాటి అవసరం వుందని, పంజాబ్, అస్సాం పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు వాటికి సుముఖంగా వున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ కమిషన్ వచ్చే అవకాశం వుందంటారా?

జ: ఇటువంటి కమిషన్‌ని ఏర్పాటుచెయ్యడం వల్ల ప్రభుత్వానికి కలిగే నష్టం ఏమీ లేదు. ఎందుకంటే దానికున్న అధికారాలు ఎలాగూ తక్కువే! ఒక Standing bodyగా ఈ కమిషన్ వుంటుంది అంతే. అయితే, ప్రజలలో వాళ్ల హక్కుల పట్ల చైతన్యం పెరిగింది. ఎప్పుడైతే వాళ్లల్లో ఆకాంక్ష బలంగా వుంటుందో, ప్రభుత్వం దాన్ని గుర్తించాల్సి వుంటుంది. కమిషన్ పెట్టడమంటే ఈ ఆకాంక్షను బలపరచడమే. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ఏమీ సుముఖంగా వున్నట్టు కనిపించడం లేదు.

ప్ర: ఎపిసిఎల్‌సి ఈ కమిషన్ నుంచి ఏం ఆశిస్తోంది?

జ: ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన నక్సలైటు కుటుంబాలకు కనీసం పునరావాసం సులభతరం కావాలని ఆశిస్తున్నాం. ఒక ఎకరం పొలమో, కొంత డబ్బో చనిపోయిన నక్సలైటు భార్యాపిల్లలకు ఇచ్చేలా చూడాలని మా ఆశ. ఇదిలేకాక పోలీస్ లాకప్‌లో చనిపోయిన వారి కుటుంబాలకు కొంత నష్టపరిహారం లభించాలి. గత తొమ్మిది సంవత్సరాలలో - 1984 నుంచి 93 వరకు మన రాష్ట్రంలో 205 లాకప్ మరణాలు సంభవించాయి. ఈ సంవత్సరం ఇప్పటి వరకూ 15 జరిగాయి. వీళ్లల్లో చాలామంది ఎస్.సి., ఎస్.టి.లు. ఇటువంటివారిపైన వున్న నేరాలు చట్టప్రకారం నిరూపించబడేంత వరకూ వారి హక్కులు హరించే అధికారం ఎవరికీ లేదు. కానీ ఏకంగా మరణాలే సంభవిస్తున్నాయి. వాళ్ల కుటుంబాలకు కనీసం నష్టపరిహారం లభించాలన్నది మా కోరిక.

ప్ర: మీపై, ఇతర పౌర హక్కుల సంఘం నాయకులపై జరిగిన దాడి వల్ల మీ కర్థమైన విషయం ఏమిటి?

జ: ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఇటువంటి విచారణలకు సిద్ధంగా లేరనీ, వాటిని జరగనివ్వరనీ.

ప్ర: పౌరహక్కుల ఉద్యమం ఆంధ్రప్రదేశ్‌లో ఇంత బలంగా వుండడానికి కారణాలు ఏమిటంటారు?

జ: నేనుకోవడం అనేక ప్రజా ఉద్యమాల స్ఫూర్తి, రాజకీయ చైతన్యం అని. ఎపిసిఎల్‌సి పుట్టడం వామపక్ష ఉద్యమాల నుంచే పుట్టింది. అప్పటి ప్రజా ఉద్యమాలు రకరకాల ఆలోచనలకు అవకాశమిచ్చాయి. కానీ ఇప్పుడు ఎపిసిఎల్‌సి Concerns విస్తృతం అయ్యాయి. State-sponsored Violenceనే కాక వ్యవస్థీకృత హింసను ఏ రూపంలో వున్నా వ్యతిరేకిస్తూ రావడం జరుగుతోంది. బహుశ ఇవే కారణాలు కావచ్చు.

ప్ర: హింస అన్న విషయానికి వచ్చినపుడు వ్యక్తి చేసే హింసను, ఒక గుంపు చేసే హింసను మీ సంఘం ఎలా చూస్తుంది? తుపాకి పట్టుకోవడాన్ని ఎక్కడ సమర్థిస్తున్నారు? ఎక్కడ విభేదిస్తున్నారు?

జ: ప్రతి దేశంలోను శాంతిభద్రతలు కాపాడే యంత్రాంగం వుంటుంది. ప్రజల హక్కుల్ని, మానప్రాణాల్ని కాపాడడం దీని లక్ష్యం. ఈ యంత్రాంగమే వాళ్ల హక్కుల్ని, మానప్రాణాల్ని దోచుకోవడం చేస్తే వాళ్ళని ఎవరు శిక్షిస్తారు? ఒక పౌరుడు తప్పు చేస్తే విచారించడానికి కోర్టులు వున్నాయి, దండించడానికి వాటిక్కావలసిన వ్యవస్థలు వున్నాయి. కానీ ఈ శాంతిభద్రతల రక్షణ వ్యవస్థలోనే ఎవరైనా చట్టవిరుద్ధమైన పనిచేస్తే ఎటువంటి చర్యా తీసుకోబడదు. ఎందుకని?

తెలంగాణాలో తన ఇంట ఆకర్షణీయమైన వస్తువుగానీ, అందమైన స్త్రీ గానీ వుండడమంటేనే భయపడిపోయేవాళ్ళు చిన్న చిన్న రైతులు, కూలీలు. ఎందుకంటే భూస్వామి కావాలంటే, వాటిని ఇచ్చెయ్యడమేగానీ, కాదనే ప్రసక్తి లేదు. ఫారెస్ట్ ఏరియాలలో అధికారులు పెట్టే బాధల గురించి చాలామందికి తెలీదు. మరి ఇలాంటి చోట్ల అసమానతలను రూపుమాపే

# విధానం కావాలి'

'జాతీయ మానవ హక్కుల కమిషన్' ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన సందర్భంగా, పోలీసులు ఆ విచారణను నక్సల్స్ బాధితుల ప్రదర్శనగా మార్చారని వార్తలు వెలువడిన నేపథ్యంలో ఏపీసీఎల్‌సీ ప్రధాన కార్యదర్శి బాలగోపాల్‌తో జరిపిన 'ఇంటర్వ్యూ'.

ప్రయత్నంలో జరిగే హింసను ఖండించాలా? ఒక వ్యక్తి నిండైన జీవితాన్ని హరించే అధికారిక హింసను ఖండించాలా? సాంఘిక, ఆర్థిక విషయాలను పరిగణనలోకి తీసుకోకుండా హింస గురించి మాట్లాడడం సులభం కాదు. తుపాకి నైపు కాకుండా, తుపాకి ఎందుకు పట్టుకున్నాడో చూడడం ముఖ్యం.

తమ లక్ష్యానికి విరుద్ధమైన హింసను మేము వ్యతిరేకిస్తూ వచ్చాం - నక్సలైట్స్ అయినాగానీ అమాయకుల్ని బలిచేయడం తప్ప. కుటుంబంలో స్త్రీని నిండైన వ్యక్తిగా చూడక, ఆమెను అణచివేయడానికి ఉపయోగించే హింస, కులం పేరుతో అట్టడుగు వర్గాలపై జరుగుతున్న హింసను పౌర హక్కుల సంఘం పూర్తిగా వ్యతిరేకిస్తుంది.

ప్ర: 'టాడా' కేసులు ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 3000 దాకా నమోదైనాయి. దీనిని గురించి జస్టిస్ రంగనాథ్ మిశ్రా కుడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇన్ని కేసులు నమోదవ్వడానికి గల కారణాలు ఏమయ్యుంటాయి?

జ: ఒక నాగరిక సమాజంలో మనిషి నేరస్థుడని నిరూపించబడేంత వరకు అతను మనిషిగా అన్ని హక్కులు అనుభవించగలిగి వుండాలి. అతని నేరంపై బహిరంగ న్యాయవిచారణ జరగాలి. కానీ 'టాడా' ఈ సహజ హక్కుల్ని నిరాకరిస్తుంది. ఈ చట్టం క్రింద ఆధునిక మారణాయుధాలు పట్టుకుని నేరాలు చేసే వాళ్ళందరినీ బుక్ చెయ్యవచ్చు. వాళ్ళకి సంవత్సరం వరకు 'బెయిల్' నిరాకరించబడుతుంది. కాని మన రాష్ట్రంలో ఇవి ఎవరి మీద వున్నాయో తెలుసా? రైతులు, గిరిజనులు, గని కార్మికుల మీద ఏపీసీఎల్‌సీ లెక్కల ప్రకారం 15,000 మంది 'టాడా' క్రింద బుక్ చెయ్యబడ్డారు. అవకాశం వస్తే, ఇందులో 12,000 నుంచి 13,000 దాకా రైతులు, అమాయకులు అని నిరూపించగలం. ఒక రెండు వేల మంది ఆయుధాలు పట్టుకు తిరిగే నక్సలైట్లు అయ్యుండవచ్చు.

అయినా ఇంతమందినీ 'టాడా' క్రింద 'బుక్' చేశారు. పైగా మామూలు చట్టాల ప్రకారం ఏదైనా నేరం నిరూపించబడితే జడ్జి అందులోని మంచి, చెడ్డలను పరిగణనలోకి తీసుకుని శిక్ష వెయ్యొచ్చు. ఉదాహరణకు ఎలాంటి పరిస్థితులలో ఈ నేరం చెయ్యాల్సి వచ్చిందీ, సాక్ష్యం ఎంత బలంగా వుందీ, అన్నవి చూసి. కానీ 'టాడా'లో జడ్జికుండే ఈ వివేచనా జ్ఞానానికి కూడా గౌరవం లేదు. కనీసం అయిదు సంవత్సరాల శిక్ష వెయ్యాల్సి వుంటుంది. నిజానికి దేశ సమగ్రతకు భంగం వాటిల్లే నేరాలకు ఈ చట్టాన్ని వాడాల్సి వుంది. అయినా, చిన్న చిన్న నేరాలకు కూడా 'టాడా' క్రింద బుక్ చెయ్యడం మన చూస్తుంటాం. ఆకలికి తట్టుకోలేక ధాన్యం దొంగిలించిన వాడినీ 'టాడా' క్రిందే బుక్ చేస్తున్నారు. ఎందుకంటే - భయపెట్టడానికి. ఒక సంవత్సరం పాటు అతను జైల్లో వుంటే, ఇక మళ్ళీ జీవితాన్ని సక్రమ పద్ధతిలో పెట్టుకోవడం సాధ్యం కాదు.


ప్ర: మానవ హక్కుల గురించి పాఠ్యాంశంగా విద్యార్థులకి తెలియజెప్పాలనే జస్టిస్ రంగనాథ్ మిశ్రా సూచన మీద మీ అభిప్రాయం?

జ: బాగానే వుంటుంది. కానీ మానవ హక్కుల గురించి సరైన అవగాహన, వాటి ఉల్లంఘన అంటే ఏంటనా వున్నవాళ్ళు సిలబస్ రాస్తే బావుంటుంది. ఊరికే గాలి కబుర్లలా వుండకూడదు. ఢిల్లీలో ఈవిషయమై కూలంకషమైన పరిజ్ఞానం వున్న ప్రొఫెసర్లు వున్నారు. అటువంటివారి సలహా మేరకు రూపొందిస్తే బాగుంటుంది.

ప్ర: ఏపీసీఎల్‌సీ కోరుకునే ముఖ్యమైన మార్పు ఏమిటి?

జ: సాంస్కృతిక చైతన్యం (Cultural awareness) - అంటే ప్రజాస్వామ్యబద్ధమైన జీవితాన్ని మనసా, వాచా కోరుకునే, ఆకాంక్షించే చైతన్యం. ప్రజాస్వామ్యం అంటే ప్రతి 5 సంవత్సరాలకీ ఎన్నికలలో ఓట్లు వెయ్యడమని కాదు - అది ఒక జీవన విధానంగా, బ్రతికే మార్గంగా ఉండాలని మా ఆకాంక్ష.

— వి. కిరణ్మయి



మానవ హక్కుల ఉల్లంఘన పరిశీలనార్థం ఇటీవల జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్రంలో పర్యటించింది. వారి వెంటే పౌర హక్కుల సంఘం నాయకులు కన్నాబిరాన్, బాలగోపాల్ తెలంగాణాలోని కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాలను సందర్శించి 'నక్సల్ బాధితుల' దాడికి గురయ్యారు. దాడి వల్ల కమిషన్‌కు కొన్ని విషయాలు, ప్రజలకు కొన్ని విషయాలు అర్థమయ్యాయి. అవి -మానవ హక్కులు ఏ పరిస్థితులలో ఉల్లంఘింపబడుతున్నాయి? అని ఎన్నిసార్లు జరుగుతున్నాయి? ఎందుకు మళ్ళీ మళ్ళీ జరుగుతున్నాయి? దీనికి బాధ్యులెవరు? వ్యక్తి ప్రాణానికి ఎంత విలువ ఇస్తున్నారు మొదలైనవి. అయితే ఇవన్నీ ఊరికే 'అర్థమవుతున్నాయి' అనిపించే విషయాలు. అవతల అధికారులు ఇవతల ప్రజలు స్పష్టమైన అవగాహనకు రావడానికి దోహదం చేస్తూ ఈ మార్పులను అతి దగ్గరగా గమనిస్తున్న వారిలో ముఖ్యులు పౌర హక్కుల సంఘం నాయకులు.

2-9-94 ఆంధ్రజ్యోతి వారపత్రిక